క్లుప్తంగా

ప్రజలకు దసరా శుభాకాంక్షలు

జగ్గయ్యపేటఅర్బన్, నందిగామ: జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మొండితోక జగన్ మోహనరావు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు.

వెండి తాపడం తయారీకి విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని శ్రీఅంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి గ్రామానికే చెందిన కుక్కపల్లి చెన్నకేశవరావు, పావని దంపతులు రూ.50,116లను విరాళంగా ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావుకు ఆదివారం అందజేశారు. ఉయ్యూరు మండలం, కడవకొల్లు గ్రామానికి చెందిన యాదవరెడ్డి, హరికృష్ణ ప్రసాద్, కృష్ణజ్యోతి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళంగా అందజేశారు.

అర్చకుడు వెంకటరమణకు నివాళి



పెనుగంచిప్రోలు: అనారోగ్యంతో మృతి చెందిన శ్రీతిరుపతమ్మవారి ఆలయ ప్రధానార్చకుడు మర్రెబోయిన వెంకటరమణ మృతదేహానికి ఆదివారం స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను నివాళులర్పించారు. ఉదయభాను మాట్లాడుతూ వెంకటరమణ ఎన్నో ఏళ్లుగా అమ్మవారి సేవలో ఉండటమే కాకుండా అమ్మవారి దీక్షా గురుస్వామిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో చిరపరిచితులన్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రవికుమార్, గూడపాటి శ్రీనివాస రావు, జంగాల వాసు, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు ఉన్నారు.

152 మందికి వైద్యసేవలు



నందిగామ: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు కొనియాడారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత ఆర్థో వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. శిబిరం ద్వారా వైద్యులు 152 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నిర్వాహకుడు వాసుదేవరావు, శ్యాం ప్రసాద్, శ్రీనివాస్, సాయి కృష్ణ, రాఘవరావు,అమరయ్య, రమేష్ పాల్గొన్నారు.

దుర్గాదేవిగా కొలువుదీరిన అమ్మవారు



దుర్గాదేవి అలంకరణలో పేటలోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారు



కంచికచర్లలో వెటర్నరీ ఆస్పత్రి రోడ్డులో దుర్గాదేవిగా కొలువుదీరిన అమ్మవారు



జుజ్జూరు రోడ్డులో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నందిగామ వాసవీ అమ్మవారి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు



మంగొల్లులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామినేని ఉదయభాను , భక్తులు

కంచికచర్ల : దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా భక్తులు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దుర్గమ్మ మమ్ము కరుణించు అంటూ భక్తులు అమ్మవారిని వేడుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కంచికచర్లలోని స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, జుజ్జూరు రోడ్డులో విశ్వశాంతి మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు దుర్గాదేవిదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు.స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. కీసర మున్నలూరు, కునికెనపాడు, గండేపల్లి గ్రామాల్లో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు(కంచికచర్ల) : దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఆదివారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జుజ్జూరులో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద భక్తులు విశేష పూజలు చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.మంగొల్లులోని రామాలయం వద్ద ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. వత్సవాయిలోని శ్రీవత్సవాయమ్మతల్లి ఆలయం, లింగాల ఉమామహేశ్వర స్వామి, చిట్టేల వెంకటేశ్వరస్వామి, మక్కపేట ప్రసన్నాంజనేయ, అయ్యప్ప ఆలయాలు, భీమవరం ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

నందిగామలో..

నందిగామ: దేవి శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా ఆదివారం జగన్మాత కనకదుర్గదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. డివిజన్ వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయం, శుక శ్యామలాంబ, మరిడి మహాలక్ష్మి, అంబారుపేట శ్రీ సత్యమ్మ ఆలయాల్లో అమ్మవార్లు కనకదుర్గగా భక్తులను దర్శనమిచ్చారు. పల్లగిరి గట్టుపైగల త్రిశక్తి పీఠంలోని అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. నియోజకవర్గపరిధిలో బతుకమ్మల సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నందిగామలోని సీఎం రోడ్డు, రామలింగేశ్వరనగర్, నెహ్రూనగర్, కాకానినగర్, పాతబస్టాండ్, బీసీ కాలనీ, పట్టణ శివారు అనాసాగరంతోపాటు లింగాలపాడు, మాగల్లు, అంబారుపేట, పెద్దవరం, చందాపురం, రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డల్లో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్ : శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకుని అమ్మవారు శ్రీకనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక నకాశిబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీచండి మూలమంత్ర సహిత రుద్రహోమం, కుంకుమార్చన నిర్వహించారు. అద్దాలబజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో శ్రీలక్ష్మీగణపతి, చండీ మూలమంత్ర సహిత శ్రీమహాలక్ష్మి హోమం, ఆయుధ పూజ చేశారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి శ్రీచక్ర కుంకుమ పూజ, చండీ హోమం చేయగా, చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీసోమవంశ సహస్రార్జున క్షత్రియ(ఖత్రి) సమాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.అద్దాలబజారులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంతోపాటు ఆయా మండపాల్లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలో అమ్మవారు ఆదివారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. షేర్‌మహ్మద్‌పేట, గౌరవరం, బలుసుపాడు, ధర్మవరప్పాడు తండ, జయంతిపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు దుర్గామాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఈశ్వరీదేవి, కోదాడ రోడ్డులోని కలకత్తా కాళీమాత ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం



రైతుపేటలో హోమం చేస్తున్న భక్తులు




నందిగామలో కనకదుర్గ అలంకరణలో సుఖశామలాంబ అమ్మవారు



జయంతి గ్రామంలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



పేట కోదాడరోడ్డులోని కలకత్తా కాళీమాత ఆలయంలో అమ్మవారు



పేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు



లింగాలపాడులో బతుకమ్మ సంబరాలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

శ్రీతిరుపతమ్మ అమ్మవారికి కుంకుమపూజలు



పెనుగంచిప్రోలు తిరుపతమ్మవారి ఆలయంలో

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి ఉత్సవాలు పెనుగంచిప్రోలు మండలంలో వైభవంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజ , సూర్యనమస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వర రావు, ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక తూర్పు బజారులో శ్రీదుర్గా మల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, పెనుగంచిప్రోలు మండలంలోని ముండ్లపాడు, నవాబుపేట, కొణకంచిలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచి భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

సచివాలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న విప్ ఉదయభాను

రామచంద్రునిపేట(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. జిల్లా మైనింగ్ ఫండ్స్ రూ.30లక్షలతో రామచంద్రునిపేటలో నిర్మించనున్న సచివాలయ భవనానికి ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అన్నివర్గాల వారికి అందించేందుకు ఈ వ్యవస్థ ముఖ్యభూమిక పోషిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే ప్రజలు అనేక ఇబ్బందులు పడగా, నేడు గ్రామ సచివాలయాల్లోనే అర్హులైనవారు దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దుల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయల చిన్నపిచ్చయ్య, యర్రంశెట్టి చిన్న తిరుపతిరావు, అనంతరాములు, పెద్ద వెంకయ్య, ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బతుకమ్మ ఉత్సవాలు



బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న సామినేని విమలాభాను, రంగాపురం రాఘవేంద్ర , టి.సుధారాణి, మహిళలు



కోలాట ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

జగ్గయ్యపేటఅర్బన్ : దసరా పండుగ మహోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 14 నుంచి నిర్వహిస్తున్న బతుకమ్మ ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. స్థానిక రేణకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అందమైన పుష్పాలతో అలంకరించిన బతుకమ్మలను తీసుకువచ్చి వేదికపై ఉంచి గౌరీదేవి, బతుకమ్మ గేయాలు ఆలపిస్తూ పూజలు చేశారు. మహిళల కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర దంపతులు, ఎమ్మెల్యే ఉదయభాను సతీమణి విమలాభాను, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు సతీమణి సుధారాణి పాల్గొని ఉత్సాహంగా కోలాటాలు ఆడి భక్తులను ఉత్సాహపరిచారు. బతుకమ్మ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు అనంతరాజా, తులసి సుబ్బారావు, కమిటీ ప్రతినిధులు నోముల శివకుమార్, యర్రా శ్రీనివాసరావు, చక్కా సుధాకర్, కేతవరపు వెంకట్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగా అందరివాడు



రంగా విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చెవిటికల్లు(కంచికచర్ల) : మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా ఒక కులం.. మతం.. వర్గానికి చెందినవ్యక్తి కాదని, అన్ని వర్గాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు కొనియాడారు. మండలంలోని చెవిటికల్లులో విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా బతికి ఉన్నంతకాలం పేద, మధ్య తరగతి ప్రజలకు సేవ చేశాడని కొనియాడారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు పోరాటం చేస్తున్న వంగవీటి మోహన్‌రంగాను ఆనాటి టీడీపీ ప్రభుత్వం పొట్టనపెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. రంగా ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని కోరారు. సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బుడ్డి సత్యనారాయణ, వెలగలేటి బాబు, వాసు, నాగులు, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.